అంగన్‌వాడీల్లో అసౌకర్యాలు

- మాటలకే పరిమితమైన హామీలు
- వసతులు లేక చిన్నారుల అవస్థలు
- గర్భిణులు, బాలింతల పరిస్థితి అంతే

హుజూరాబాద్‌రూరల్‌: చిన్నారులు చదవటం తెలుసుకునే వయస్సు, ఇతర పిల్లలతో ఆనందంగా గడిపే ప్రదేశం అంగన్‌వాడీ కేంద్రం, అలాంటి కేంద్రాలు పిల్లల పాలిట శాపంగా మారుతున్నాయి. చిన్నారులకు సకల సదుపాయాలు కల్పిస్తామని ప్రజాప్రతినిధులు మాటలు చెప్పటం తప్పా ఆచరణలోకి రాకపోతుండటంతో సమస్యల మధ్యే పిల్లలు ముందుకు సాగుతున్నారు. హుజూరాబాద్‌ మండలంలోని 63 అంగన్‌వాడీ కేంద్రాలకు 753 మంది చిన్నారులు వస్తున్నారు. అభం శుభం తెలియని చిన్నారులను తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిస్తే అక్కడ కనీస సదుపాయలు లేకపోవడంతో చిన్నారులు విలవిలాడుతున్నారు. మరుగుదొడ్లు లేకపోవడంతో చిన్నారులను ఆరుబయట పంపించాల్సిన పరిస్థితి నెలకొంది. వానాకాలం కావడంతో అంగన్‌వాడీ కేంద్రాల చుట్టూ అపరిశుభ్ర వాతావరణం పెరిగిపోయింది. పిల్లలు రోగాల బారిన పడే అవకాశం ఉంది. కేంద్రాలకు వస్తున్న చిన్నారులకు మూస పద్ధతిలో కాకుండా జ్ఞాపక శక్తిని పెంచేలా బోధన జరగాల్సి ఉంది. కానీ కేంద్రాల్లో బోధన తుతూ మంత్రంగానే ఉంది. పలక, బలపం ఇచ్చి అక్షరాలను దిద్దించాలి కానీ పరిస్థితి అలా లేదు, ప్రాక్టికల్‌గా బోధించాల్సి ఉండగా పాత పద్ధతిలో బోధన సాగుతుంది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా డిజిటల్‌ టీచింగ్‌, ప్లే మేథడ్‌లో బోధిస్తే పిల్లలకు మేలు జరిగే అవకాశం ఉంది. ఇక కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతల పరిస్థితి మరీ ఘోరంగా ఉంది. కూ ర్చొందుకు కనీసం కుర్చీలు లేకపోవడంతో నేలపైనే కష్టంగా కూర్చోవాల్సి వస్తోంది. బాలింతలు కోడిగుడ్లు, ఆహారం తీసుకునేందుకు వస్తే వారి పరిస్థితి అంతే. ఇరుకుగదులు, కనీసం సున్నం వేయకపోవడంతో పురాతన భవనాలను తలపిస్తున్నాయి.



కందుగుల అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో ఆగిన మరుగుదొడ్డి నిర్మాణ పనులు

నిధులు మంజూరు చేయాలి



అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలను పంపించండి, బాగా చూసుకుంటామని చెబుతున్నారు కానీ కేంద్రాల్లో ప్రభుత్వం కనీస సదుపాయాలు కల్పించకపోవడంతో చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు ఎలా పంపించాలి, పంపించినా అలాంటి పరిస్థితుల్లో ఉండలేరు. ప్రభుత్వం వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయాలి.

–కాసుల జగన్‌మూర్తి, చిన్నారి తండ్రి, కందుగుల

అన్నివసతులు కల్పించాలి



అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నారులను పంపించాలంటే భయమేస్తోంది. చిన్నారులు కేంద్రాలకు అలవాటు పడేలా అన్నిరకల వసతులు ఉంటే బాగుంటుంది. ఇవి లేకుండా పంపించాలంటే ఇబ్బందిగానే ఉంది. ఆడుకునేందుకు వీలుగా ఆటవస్తువులు, తినే ఆహార ప్రాంతం శుభ్రంగా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

–జక్కుల రజిత, చిన్నారి తల్లి, కందుగుల

అధికారులను బెదిరించడం మానుకోవాలి

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

శంకరపట్నం: ఎమ్మెల్యేగా పనికి రావని ప్రజలు ఛీ కొట్టినా బుద్ధిరాలేదని మానకొండూర్‌ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ను ఉద్దేశించి విమర్శలు చేశారు. మండల ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో నిర్మించిన నమూనా ఇందిరమ్మ ఇంటిని గురువారం ప్రారంభించారు. పదేళ్ల పాలన ఆటపాటలకే సరిపోయిందని, అధికారులకు ఫోన్‌ చేసి బెదిరించడం మానుకోవాలని సూచించారు. లబ్ధిదారులు నమూనా ఇంటిని పరిశీలించాలని సూచించారు. సమావేశంలో హౌసింగ్‌ పీడీ గంగాధర్‌, ఎంపీడీవో కృష్ణప్రసాద్‌, తహసీల్దార్‌ సురేఖ, మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్‌, మార్కెట్‌ వైస్‌ చైర్మన్‌ తిరుపతి, ఆలయ చైర్మన్‌ రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. మండలంలోని కొత్తగట్టు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్‌ ప్రొసీడింగ్స్‌ పంపిణీ చేశారు.

పప్పు దినుసుల్లో అధిక ప్రోటీన్లు

గన్నేరువరం: పప్పు దినుసుల్లో ప్రోటీన్లు అధికంగా ఉంటాయని, పంటల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఎమ్మెల్యే అన్నారు. నేషనల్‌ ఫుడ్‌ సెక్యూరిటీ, న్యూట్రీ మిషన్‌ 2025లో భాగంగా కంది పంట సాగుకు సంబంధించి 30 మంది రైతులకు ఒక్కొక్కరికి 4 కిలోల బ్యాగులను మండల కేంద్రంలోని రైతువేదికలో అందజేశారు. రైతులకు ఉచితంగా నాణ్యమైన విత్తనాలను అందించి పంటల దిగుబడి మెరుగుపచడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. శంకరపట్నం, మానకొండూర్‌, తిమ్మాపూర్‌ మండలాల్లో రైతులకు మినుములు, కంది విత్తనాలను అందజేస్తామన్నారు. అనారోగ్య సమస్యలతో మంచానికే పరిమితమైన పారువెల్ల గ్రామానికి చెందిన యాళ్ల స్వామిరెడ్డికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి చెక్కులు మంజూరు కాగా ఎమ్మెల్యే బాధితుడి ఇంటికి వెళ్లి అందజేశారు. మండలంలోని 47 మందికి సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులను గన్నేరువరం రైతువేదికలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి భాగ్యలక్ష్మీ, ఏడీఏ శ్రీధర్‌, ఏవో కిరణ్మయి, కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, ఏఈవోలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



విత్తనాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

బాధ్యతలు స్వీకరణ

ఇల్లందకుంట: ఇల్లందకుంట ఎస్సైగా ఎం.క్రాంతికుమార్‌ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ మండలంలోని శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని అన్నారు. మండలంలోని బీజేపీ నాయకులు ఎస్సైని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రమణారెడ్డి, కిసాన్‌మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, రమేశ్‌, విజయ్‌బాబు, తాళ్ల పాపిరెడ్డి, కొక్కుల దేవేందర్‌, వలసాని సునీల్‌, తిరుపతి, మొండయ్య తదితరులు పాల్గొన్నారు.

డీటీఎఫ్‌ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదులో ఉపాధ్యాయులు

ఇల్లందకుంట: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకుముందే పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే మంజూరుచేయాలని డీటీఎఫ్‌ జిల్లా అధ్యక్షుడు ఆవాల నరహరి ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. గురువారం మండలంలోని వివిధ పాఠశాలలను డీటీఎఫ్‌ మండలశాఖ ఆధ్వర్యంలో సందర్శించి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల జీపీఎఫ్‌, సరెండర్‌ లీవు, టీఎస్‌జీఎల్‌ఐ, ఉద్యోగ విరమణ పొందిన వారి రిటైర్మెంట్‌ బెనిఫిట్స్‌ వంటి పెండింగ్‌ బిల్లులన్నీ వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఏబూసి శ్రీనివాస్‌, సార్ల సంపత్‌, సిహెచ్‌.వేణు, సదానందం, ప్రకాష్‌, సమ్మిరెడ్డి, సంతోష్‌ పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ

హుజూరాబాద్‌ : ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను గురువారం ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి లబ్ధిదారుల ఇంటికి ఇంటింటా తిరుగుతూ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్‌ మాజీ చైర్మన్‌ శ్రీనివాస్‌, మున్సిపల్‌ మాజీ చైర్మన్‌ శ్రీనివాస్‌, కౌన్సిలర్లు ఉన్నారు.

బీఎల్వోలకు అవగాహన

మానకొండూర్‌: మండల కేంద్రంలోని రైతువేదికలో గురువారం బీఎల్‌వో, సూపర్‌వైజర్లకు ఎన్ని కల విధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ట్రైనీలు శ్రీనివాస్‌, రజినీకాంత్‌ రెడ్డి ఓటరు నమోదు, తొలగింపు, తప్పుల సవరణ పలు విషయాలను వివరించారు. తహసీల్దార్‌ విజయ్‌కుమార్‌, ఆర్‌ఐలు రా ములు, సమీనా, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌ : పట్టణంలోని జిల్లా పరిషత్‌ ఉన్నత బాలుర పాఠశాలలో ఆర్డీవో రమేష్‌బాబు ఆధ్వర్యంలో బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లకు ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సలహాలు, సూచనలు తెలియజేశారు. ఎన్నికల సంఘం రూపొందించిన నియమాల ప్రకారం వివరాలను పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్‌ తహసీల్దార్‌ కె. కనకయ్య, మున్సిపల్‌ కమిషనర్‌ కె. సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

● వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

జమ్మికుంట రూరల్‌ : సీజనల్‌ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డా. చందు అన్నారు. గురువారం ఎగంద్రపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలలో వావిలాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య పరీక్షలు చేసి మందుల పంపిణీ చేశారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలన్నారు. పోషక విలువలు ఉండే ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు.

● దళితరత్న అవార్డు

శంకరపట్నం: మండలంలోని ముత్తారం గ్రామానికి చెందిన కనకం సాగర్‌ గురువారం కరీంనగర్‌లో జరిగిన ఎమ్మార్పీఎస్‌ సభలో దళితరత్న అవార్డు అందుకున్నారు. దళితుల సమస్యల పట్ల పని చేసినందుకు అవార్డు ప్రదానం చేశారని సాగర్‌ తెలిపారు. సాగర్‌కు దళితరత్న అవార్డు రావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

● ఎమ్మార్పీఎస్‌ కార్యకర్తల సమావేశం

ఇల్లందకుంట: మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్‌ మండల ఇంచార్జి ఎర్ర ఆదిత్య మాదిగ ఆధ్వర్యంలో గురువారం ఎమ్మార్పీఎస్‌ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్‌ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఈనెల 7న ఎమ్మార్పీఎస్‌ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ, గ్రామ కమిటీల నిర్మాణం, మందకృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకొని వేడుకలు విజయవంతం చేయడానికి సమావేశాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. మండల కన్వీనర్‌గా కనగర్తి గ్రామానికి చెందిన రామంచ సంపత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నాట్లు తెలిపారు.

● ఆలయాలకు విరాళం

రామడుగు: మండల కేంద్రంలోని శ్రీమడేలేశ్వరస్వామి ఆలయం అభివృద్ధికి మేడిపల్లి రూపాదేవి ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో మార్కెట్‌ కమిటీ చైర్‌పర్సన్‌ బొమ్మరవేని తిరుమల గురువారం రూ.పదివేల విరాళం అందజేశారు.

గన్నేరువరం: జంగపల్లి గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న మడేలేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి కాంగ్రెస్‌ పార్టీ యువజన కాంగ్రెస్‌ మాజీ సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి గురువారం రూ.పదకొండు వేలు విరాళంగా అందజేశారు. అనంతరం శ్రీనాథ్‌రెడ్డిని రజక సంఘం సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు.

● ఇసుక లారీలను అడ్డుకున్న గ్రామస్తులు

వీణవంక: మండలంలోని హిమ్మత్‌ నగర్‌ గ్రామంలో ఇసుక లారీలను గ్రామస్తులు గురువారం అడ్డుకున్నారు. లారీలకు తాటుపత్రులు కప్పడానికి ఉపాధి కల్పించాలని డిమాండ్‌ చేశారు. కొండపాక గ్రామస్తులు మాత్రమే ఉపాధి పొందుతూ పొట్టకొడుతున్నారని ఆరోపించారు. ఇసుక క్వారీ యజమానులు మాత్రం స్పందిచడం లేదని తెలిసింది.

● టెండర్‌ విషయంలో తప్పు లేదు

హుజూరాబాద్‌: హుజురాబాద్‌ మున్సిపల్‌ కమిషనర్‌ సమ్మయ్య టెండర్‌ విషయంలో ఎలాంటి తప్పు లేకున్నా ఉద్దేశపూర్వకంగా ఫిర్యాదు చేశారని బీజేపీ నాయకులు కుందనపల్లి రవీందర్‌ రెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. అధికారులు, వారి బంధువులు కాంట్రాక్టులు చేయడానికి వీల్లేదని, ప్రభుత్వ నిబంధనలు సూచిస్తున్నాయని తెలిపారు.

● మొక్కలు నాటిన విద్యార్థులు

చొప్పదండి: మండలంలోని రాగంపేట జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల ఏడో తరగతి విద్యార్థులు గురువారం గ్రామ శివారులోని కాలువ గట్టుపై మొక్కలు నాటారు. గైడ్‌ టీచర్‌ కర్ర వెంకట్‌ రాం రెడ్డి విద్యార్థులకు మొక్కల పెంపకం గురించి వివరించారు. ఎస్‌ఆర్‌ఎస్‌పీ ఉప కాలువల సమీపంలో మొక్కల పెంపకం చేపట్టినట్లు తెలిపారు.

● విజయవంతం చేయండి

ఇల్లందకుంట: హైదరాబాద్‌లోని ఎల్బీస్టేడియంలో శుక్రవారం జరిగే కాంగ్రెస్‌ పార్టీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం చైర్మన్‌ ఇంగిలే రామారావు పిలుపునిచ్చారు. ముఖ్య అతిథిగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖరే, ఏఐసీసీ జనరల్‌ సెక్రటరీ వేణుగోపాల్‌, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ఇంచార్జి మీనాక్షి నటరాజన్‌, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క హాజరుకానున్నారని అన్ని గ్రామాల కాంగ్రెస్‌ పార్టీ గ్రామశాఖల అధ్యక్షులు,అనుబంధ సంఘాల అధ్యక్షులు పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు.

జమ్మికుంట: హైదరాబాద్‌ ఎల్బీ సేడియంలో శుక్రవారం నిర్వహించే జైబాపు, జైభీమ్‌, జై సంవిధాన్‌ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకుడు అంబాల రాజు గురువారం ఒక ప్రకటనలో పిలుపు నిచ్చారు.

బీజేపీ సీనియర్‌ నేత హరికుమార్‌ గౌడ్‌ మృతి

కరీంనగర్‌టౌన్‌: బీజేపీ సీనియర్‌ నేత తాళ్లపల్లి హరికుమార్‌గౌడ్‌ గురువారం తెల్లవారుజామున గుండె సంబంధిత వ్యాధితో మృతి చెందారు. బీజేపీలో సీనియర్‌ నేతగా హరికుమార్‌గౌడ్‌కు మంచి గుర్తింపు ఉంది. పార్టీ బలోపేతం కోసం మూడు దశాబ్దాలుగా కృషిచేశారు. హరికుమార్‌గౌడ్‌ అకాల మరణంపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డితో పాటు బీజేపీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. హరికుమార్‌ గౌడ్‌ భారతీయ జనతా పార్టీలో వివిధ హోదాల్లో పని చేశారని గుర్తుచేశారు.



హరికుమార్‌గౌడ్‌ (ఫైల్‌)

మార్కెట్‌ కార్యదర్శిపై దాడి సరికాదు



కరీంనగర్‌ అర్బన్‌: మహబూబ్‌నగర్‌ మార్కెట్‌ కమిటీ కార్యదర్శి భాస్కర్‌పై ఆ మార్కెట్‌ కమిటీ వైస్‌ చైర్మన్‌ దాడి చేయడం సరికాదు అని వ్యవసాయ మార్కెట్‌ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సయ్యద్‌ హమీద్‌ అలీ అన్నారు. దాడి ఘటనను ముక్తకంఠంతో ఖండిస్తూ నిరసనగా బుధవారం భోజన విరామ సమయంలో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి కరీంనగర్‌ వ్యవసాయ మార్కెట్‌ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. మార్కెటింగ్‌ శాఖ ఉన్నతాధికారులు వైస్‌ చైర్మన్‌ను చట్ట ప్రకారం శిక్షించి పదవి నుంచి తొలగించాలని డిమాండ్‌ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావతం కాకుండా కఠిన చర్యలుండాలని అన్నారు. వ్యవసాయ మార్కెట్‌ కమిటీ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి రమణ, శేఖర్‌, సతీశ్‌ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైతులకు అందుబాటులో ఎరువులు



దుకాణాన్ని తనిఖీ చేస్తున్న భాగ్యలక్ష్మి

గన్నేరువరం: ఖరీఫ్‌ సాగుకు సంబంధించి ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతుల అనవసరంగా ఆందోళన చెందొద్దని జిల్లా వ్యవసాయశాఖ అధికారి భాగ్యలక్ష్మీ అన్నారు. మండలకేంద్రంలో డీసీఎంఎస్‌, సహకార సంఘం, గ్రోమోర్‌ ఆధ్వర్యంలో ఎరువుల దుకాణాలను గురువారం తనిఖీ చేశారు. ఎరువుల స్టాక్‌ రికార్డులను పరిశీలించారు. ఎరువుల బస్తాలను ఎక్కువగా తీసుకెళ్లి ఇంటి వద్ద నిల్వ పెట్టుకోకుండా అవసరం మేరకు తీసుకెళ్లాలని తెలిపారు. డీలర్లు సైతం ఎరువుల కొరత సృష్టించొద్దన్నారు. అలాగే మండలంలో సాగవుతున్న పంటలు, విస్తీర్ణం వివరాలను తెలుసుకున్నారు. వెంట ఏడీఏ శ్రీధర్‌, ఏవో కిరణ్మయి, డీలర్లు, రైతులు ఉన్నారు.

పేపర్‌ ప్లేట్స్‌ తయారీ మిషన్‌ బహూకరణ



మిషన్‌ను ప్రారంభిస్తున్న దాత కుటుంబ సభ్యులు, నిర్వాహకులు

జమ్మికుంట: మున్సిపల్‌ పరిధి మారుతినగర్‌లోని సాయి మానసిక దివ్యంగుల ప్రత్యేక పాఠశాలకు అమెరికాలో నివసిస్తున్న పట్టణానికి చెందిన జడల రవికుమార్‌,రేఖ దంపతులు విద్యార్థులకు ఉపయోగపడే రూ.1,50,000 విలువ గల పేపర్‌ ప్లేట్స్‌ తయారీ మిషన్‌ గురువారం బహూకరించారు. ఈ సందర్భంగా సాయి ఆశ్రమంలో ఏర్పాటు చేసిన శృతి వొకేషనల్‌ ట్రెనింగ్‌ సెంటర్‌ను జడల భాస్కర్‌రావు కుమారుడు సందీప్‌కుమార్‌, శ్రీజ ప్రారంభించారు. పాఠశాలకు మరింత సాయం అందిస్తామన్నారు. పేరెంట్స్‌ కమిటీ అధ్యక్షుడు సూత్రపు బచ్చిరాములు దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బోరుబావులకు మోటార్లు బిగింపు

చిగురుమామిడి: మండల కేంద్రంలో బోరుబావుల్లో మోటార్ల బిగింపునకు రూ.7.75 లక్షలు మంజూరయ్యాయని మాజీ జెడ్పీటీసీ గీకురు రవీందర్‌ తెలిపారు. గురువారం చర్చివద్ద వేస్తున్న బోరుబావి పనులను పరిశీలించారు. జిల్లా పరిషత్‌ గ్రాంటు కింద నాలుగు బోరుబావులకు మోటార్ల బిగింపు ప్రతిపాదనలు చేశామని, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖా మంత్రి పొన్నం ప్రభాకర్‌ తన కోటా నుంచి నిధులు మంజూరు చేశారని తెలిపారు. చర్చి, ముదిరాజ్‌ స్మశానవాటిక, వైకుంఠథామం, పల్లెప్రకృతి వనాల వద్ద మోటార్లు బిగిస్తామన్నారు. జెడ్పీటీసీ వెంట పలువురు గ్రామప్రముఖులు ఉన్నారు.

ఆర్టీవోకు వినతి

హుజూరాబాద్‌ : పట్టణంలోని రవాణా శాఖ కార్యాలయంలో ఆర్టీవో కంచె వేణుకు గురువారం ఏఐఎస్‌ఎఫ్‌ నాయకులు వినతి పత్రం సమర్పించారు. ప్రైవేట్‌ విద్యా సంస్థలకు సంబంధించిన స్టూడెంట్స్‌ బస్సులను క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. ఫిట్‌నెస్‌ లేకుండా తిరుగుతున్న వాహనాలను వెంటనే సీజ్‌ చేయాలన్నారు. స్కూల్‌ బస్సులలో ఫస్ట్‌ ఎయిడ్‌ బాక్సులను, బస్సు లోపల ఫైర్‌ సేఫ్టీలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్‌,గణేష్‌, రాజేష్‌, శ్రీకాంత్‌ తదితరులు పాల్గొన్నారు.


సన్మానం

హుజూరాబాద్‌: పట్టణంలోని సైదాపూర్‌ రోడ్డులో ఉన్న ఓ ఫంక్షన్‌ హాల్‌లో గురువారం రిటైర్డ్‌ ఉపాధ్యాయుడు భారత ప్రభాకర్‌ను తెలంగాణ ఆల్‌ పెన్షనర్స్‌ అండ్‌ రిటైర్డ్‌ పర్సన్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో సంఘం బాధ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు జనార్దన్‌, నాగభూషణాచారి, వీరస్వామి,మల్లారెడ్డి, గరిగే చంద్రయ్య, తాటి పాముల కనకయ్య, తౌటం శ్రీహరి, దొంత హరికిషన్‌ తదితరులున్నారు.

క్షీరాభిషేకం

రామడుగు: మండలంలోని దేశరాజ్‌పల్లి పల్లె దవాఖానకు ప్రతిమ వైద్య కళాశాల డాక్టర్లను కేటాయించేలా కృషి చేసిన చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు గురువారం గ్రామస్తులు, కాంగ్రెస్‌పార్టీ నాయకులు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షులు జవ్వాజీ హరీష్‌, మార్కెట్‌ కమిటీ వైస్‌ చైర్మన్‌ పిండి సత్యంరెడ్డి, కాంగ్రెస్‌పార్టీ నాయకులు కోల రమేష్‌, బొమ్మరవేని తిరుపతి, నేరెల్ల ఆంజనేయులుగౌడ్‌, ఎల్కపల్లి లచ్చయ్య, రత్నాకర్‌ రెడ్డి, ప్రతిమ వైద్యకళాశాల సూపరింటెండెంట్‌ సీఎల్‌ ప్రసాద్‌, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

సాక్షి స్పందన





శంకరపట్నం: మండలంలోని మొలంగూర్‌ ప్రాథమిక పాఠశాల గేట్‌ ఊడిపోయి కిందపడగా తిరిగి ఏర్పాటు చేశారు. పాత శాల గేటు ఊడిపోయి కిందపడిపోయిందని గురువారం ‘సాక్షి’లో వాట్సాప్‌ కథనం ప్రచురితం కావడంతో ఎంపీవో ప్రభాకర్‌ స్పందించారు. కిందపడిన గేటును బిగించాలని ఏఈకి సూచించారు. ఈమేరకు కాంట్రాక్టర్‌తో గేటుకు వెల్డింగ్‌ చేయించి బిగించారు.

వాట్సాప్‌ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్‌ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి ‘సాక్షి’ కృషి చేస్తుంది.

మా ఫోన్‌ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

108 శాతం క్షయ నిర్ధారణ పరీక్షలు

- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌ పమేలా సత్పతి

కరీంనగర్‌టౌన్‌: జిల్లాలో నిర్దేశించిన లక్ష్యం కంటే ఎక్కువగా 108 శాతం క్షయ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు కలెక్టర్‌ పమేలా సత్పతి తెలిపారు. టీబీ ముక్త్‌ భారత్‌ కార్యక్రమంపై కేంద్ర ప్రభుత్వ టీబీ విభాగం అధికారులు గురువారం ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌ నిర్వహించారు. టీబీ పరీక్షలు, వ్యాధి నిర్ధారణ, ట్రీట్మెంట్‌ పై సమీక్షించారు. కలెక్టర్‌ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్‌ పమేలా సత్పతి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్‌ రవీందర్‌ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ పమేలా సత్పతి కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ రెండో దశ టీబీ ముక్త్‌ భారత్‌లో భాగంగా క్షయ నిర్ధారణ పరీక్షలు వేగవంతం చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా సులభంగా టీబీ సోకే అవకాశం ఉండే వారిని, వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిని గుర్తించడం, టీబీ పరీక్ష చేసి ప్రారంభ దశలోనే చికిత్స అందించడం వంటివి చేస్తున్నామని వెల్లడించారు. ప్రతిమ వైద్య కళాశాల సహకారంతో మొబైల్‌ ఎక్సరే వాహనం ఏర్పాటుచేసి టీబీ వ్యాధిగ్రస్తులను త్వరితగతిన గుర్తించేందుకు చర్యలు తీసుకోబోతున్నామని అన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్‌ పమేలా సత్పతి

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

జమ్మికుంట: డ్రగ్స్‌, గంజాయి, మత్తు వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని టౌన్‌ సిఐ రామకృష్ణ అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో డ్రగ్స్‌ అనర్థాలపై అవగాహన కల్పించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదక ద్రావ్యాల అలవాట్లతో జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. పట్టణంలోని ఏలాంటి డ్రగ్‌ అమ్మకాలు జరిగినట్లు జరిగితే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. డీఐవో గంగాధర్‌, ఇంచార్జి ప్రిన్సిపల్‌ విశ్వనాథ్‌రెడ్డి, అధ్యపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టణంలోని ప్రభుత్వ కళాశాలలో యూనియన్‌ బ్యాంక్‌ ఆధ్వర్యంలో బ్యాంక్‌ సేవలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. విద్యార్థులకు జీరో అకౌంట్‌ కల్పిస్తామని, కేంద్ర ప్రభుత్వం లోన్‌ సౌకర్యాలను వినియోగించుకోవాలన్నారు. ఆన్‌లైన్‌ లోన్‌, బెట్టింగ్‌, సైబర్‌ నేరాల పట్ల అప్రమత్తం ఉండాలన్నారు. బ్యాంక్‌ మేనేజర్‌ దొరస్వామినాయక్‌, ఎల్డీం ఆంజనేయులు, ఏరియా మేనేజర్‌ కిరణ్‌ సిబ్బంది పాల్గొన్నారు.

మానకొండూర్‌: మండలంలోని చెంజర్ల రైతు వేదికలో విడ్స్‌ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సైబర్‌ నేరాలు, మోసాలు గూర్చి అవగాహన కల్పించారు. ఆర్థిక అక్షరాస్యత కేంద్ర కౌన్సిలర్‌ శ్రీనివాస్‌ మాట్లాడుతూ.. సైబర్‌ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, తెలియని వారికి వ్యక్తిగత విషయాలు చెప్పొద్దని, మొబైల్‌కు వచ్చే అనవసర లింక్‌కు స్పందించొద్దని తెలిపారు. కౌన్సిలర్‌ సాగరిక, వ్యవసాయ అధికారులు, రైతులు, మహిళలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సీఐ రామకృష్ణ, అధ్యాపకులు

విద్యార్థులకు బ్యాగులు, నోట్‌బుక్స్‌ పంపిణీ





గన్నేరువరం: పారువెల్లలో బ్యాగులు, నోట్‌బుక్స్‌ పంపిణీ, జమ్మికుంట: కోరపల్లిలో..

గన్నేరువరం: పారువెల్లలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం కరీంనగర్‌ లయన్స్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో నోట్‌బుక్స్‌, స్కూల్‌ బ్యాగ్స్‌ అందజేశారు. హెచ్‌ఎం విజయపాల్‌రెడ్డి లయన్స్‌ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. మండల కేంద్రంలోనిప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గన్నేరువరం లయన్స్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో నోటుబుక్స్‌ అందజేశారు. లయన్‌ రాజేంద్రప్రసాద్‌ జన్మదినం సందర్భంగా కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. అనంతరం రేకుర్తి కంటి ఆసుపత్రిలో ఉచిత కంటి ఆపరేషన్‌ చేసుకొని గన్నేరువరం తిరిగి వచ్చిన రోగులకు బ్రెడ్‌ అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌ క్లబ్‌ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్‌, మల్లారెడ్డి, శ్రీనివాస్‌, సునిల్‌, ఎల్లయ్య, భాస్కర్‌, బాలయ్య, మల్లేశం, ప్రదీఫ్‌, టీచర్లు పాల్గొన్నారు.



గన్నేరువరంలో ..

జమ్మికుంటరూరల్‌ : మండలంలోని కోరపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పీఎంకె ఫౌండేషన్‌ వ్యవస్థాపకుడు ప్రభాకర్‌ గౌడ్‌ ఆదేశాల మేరకు నిర్వాహకులు నోట్‌బుక్స్‌ అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంరవీందర్‌, టీచర్లు బలరాంనాయక్‌, ఫౌండేషన్‌ నిర్వాహకులు రవిగౌడ్‌, రంజిత్‌కుమార్‌ గౌడ్‌, విద్యాకమిటీ చైర్మన్‌ రాజుపాల్గొన్నారు.